


ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 20-10-2026 | సంపుటి - 31 | సంచిక - 148 | రూ : 4 | పేజీలు: 8

పోలీసు శాఖలో
క్రియాశీలక మార్పు

- భారీగా అందుబాటులోకి రానున్న డీఎస్పీ.. ఆ పైస్థాయి అధికారులు
- కొలిక్కి వస్తున్న పదోన్నతుల ప్రక్రియ 4లో





రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే వేదిక

- గ్లోబల్ సమిట్ 2.0ను వైభవంగా నిర్వహిద్దాం
- నవంబరు 15 నాటికి అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు చేయండి
- వచ్చే జూన్‌లో రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్-1 ప్రారంభిద్దాం
- ఫ్యూచర్ సిటీ సందర్శనలో సీఎం రేవంత్‌రెడ్డి 2లో

విజయదశమి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని రేపు 20.10.2026 మా పత్రిక కార్యాలయానికి సెలవు. కావున ఎల్లుండి 21.10.2026 దినపత్రిక వెలువడదు. పాఠకులు, మరియు ప్రకటనకర్తలు ఈ విషయాన్ని గమనించగలరు.

వందే భారత్ జోరు.. 180 కి.మీ. వేగంతో
దేశీయ రైలు పరుగులు!

- గంటకు 180 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటున్న దేశీయ సెమీ హైస్పీడ్ రైళ్లు
- 2019లో ప్రారంభమై.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 160కి పైగా రైళ్ల సేవలు
- ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ లక్ష్యాలకు ప్రతీకగా నిలుస్తున్న వందే భారత్
- చైర్ కార్, స్లీపర్ వెర్షన్లపై విజయవంతంగా పూర్తయిన హైస్పీడ్ ట్రయల్స్
- భారత రైల్వేల భవిష్యత్ తరానికి పునాదిగా ఈ రైళ్లను అభివర్ణించిన ప్రధాని మోదీ



భారత రైల్వేల ఆధునికీకరణలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు దూసుకుపోతున్నాయి. పూర్తిగా దేశీయ సాంకేతికతతో రూపుదిద్దుకున్న ఈ సెమీహైస్పీడ్ రైళ్లు గంటకు 180 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని తరువాయి 2లో



ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు..
శాంతికి తాము సిద్ధమేనన్న జెలెన్‌స్కీ

- శాంతి ప్రయత్నాలకు క్షిపణులే రష్యా సమాధానమన్న జెలెన్‌స్కీ
- రష్యా దాడికి తాము ఎదురుదాడి చేయాల్సి వస్తోందని వెల్లడి
- మిత్ర దేశాల నుంచి క్షిపణి హెచ్చరికలు అందలేదన్న ఉక్రెయిన్



2లో

క్వాంటమ్ ప్రపంచంలో కొత్త ఆవిష్కరణ..
'ఫ్రాక్షనల్ ఫెర్మి సముద్రం' గుర్తింపు 2లో

- పదార్థం యొక్క సరికొత్త క్వాంటమ్ స్థితిని ఆవిష్కరించిన శాస్త్రవేత్తలు
- దీనికి 'ఫ్రాక్షనల్ ఫెర్మి సముద్రం' అని నామకరణం



రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే వేదిక

హైదరాబాద్: ''తెలంగాణలో పెట్టుబడులను ఆహ్వానించేందుకు మనం 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో గ్లోబల్ సమిట్ 2.0ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం. డిసెంబరు 7 నుంచి 9వ తేదీ వరకు సదస్సు వైభవోపేతంగా కొనసాగాలి. సంబంధిత పనులన్నీ నవంబరు 15 వరకు పూర్తి చేయాలి. సమిట్‌కు వేదికైన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో సకల సదుపాయాలను సమకూర్చాలి. విదేశీ అతిథులు, పెట్టుబడిదారుల రాకను పరిగణనలోకి తీసుకుని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టండి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారత్ ఫ్యూచర్ సిటీ, టీజీఐఐసీ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్‌సిటీలో చేపట్టిన గ్లోబల్ సమిట్ 2.0 పనుల తీరును ఆయన సోమవారం పరిశీలించారు. సాయంత్రం 6.15 గంటలకు ఇక్కడికి చేరుకున్న ఆయన... సుమారు గంటన్నరపాటు పర్యటించారు. తొలుత రతన్‌టాటా రేడియల్ రోడ్ 1 నిర్మాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఏడాది జూన్ 2న ఈ రహదారిని ప్రారంభించేందుకు వీలుగా భూసేకరణతోపాటు అన్ని పనుల్లో వేగం పెంచాలన్నారు. అనంతరం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అధికారులు సిద్ధం చేసిన చిత్రపటాలను వీక్షించారు. ఏ చిన్న అంశాన్నీ వదలకుండా షెడ్యూలు ప్రకారం పూర్తయ్యేలా పర్యవేక్షించాలని ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ కె.శశాంకను ఆదేశించారు. సదస్సు నిర్వహణకు నియమించిన ప్రత్యేక కమిటీలతో సమన్వయం చేసుకుని, రోజువారీ పురోగతిని సమీక్షించాలని సూచించారు.

*** తొలుత సమిట్.. తర్వాతే వర్సిటీ తరగతుల పనులు**

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో కొనసాగుతున్న నిర్మాణాలను సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ''మీ పెట్టుబడులకు మాది భరోసా అనే కాన్సెప్ట్‌తో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్ 2026'ను నిర్వహిస్తున్నట్లు విషయం మీకు తెలిసిందే. అందుకే తొలుత సమిట్ పనులను పూర్తిచేశాక వర్సిటీ తరగతి గదుల నిర్మాణాలను చేపట్టండి. సిబ్బంది సంఖ్యను పెంచుకుని దసరా తర్వాత పనులను వేగవంతం చేయాలి. దేశవిదేశాల నుంచి వస్తున్న పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునే స్థాయిలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాట్లు ఉండాలి. బహిరంగ ప్రాంగణం పనులు నవంబరు 15లోపు పూర్తి చేయాల్సిందే. ఇది కేవలం వ్యాపార సదస్సుగా మాత్రమే కాకుండా... తెలంగాణ రాజకీయ, ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే గొప్ప వేదికగా నిలవాలి'' అని స్పష్టంచేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పనులను 2027 ఫిబ్రవరిలో పూర్తి చేస్తే... మార్చి నుంచి ప్రవేశాలను ప్రారంభించేందుకు అనువుగా ఉంటుందని ఈ దిశగా పనులు జరుగుతున్నాయా.. లేదా... అన్న అంశాలపై తనకు ప్రతివారం నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

*** సదస్సు ప్రాంగణానికి రెండు రహదారులు...**

'ఇన్వెస్ట్ తెలంగాణ' సదస్సు కోసం రెండు రహదారులు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 2025 డిసెంబరులో జరిగిన తొలి సదస్సులో వీవీఐపీలు, విదేశీ అతిథులు వచ్చినప్పుడు కొంత సేపు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయని.. ఈసారి అలా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. దాంతో స్కిల్స్ యూనివర్సిటీ నుంచి ప్రధాన రహదారిని అనుసంధానిస్తూ నాలుగు వరుసల రహదారిని నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు ఎఫ్‌సీడీఏ కమిషనర్ కె.శశాంక... ముఖ్యమంత్రికి తెలిపారు. పది, పదిహేను రోజుల్లోనే కొత్త రోడ్డును అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. సీఎం పర్యటన కార్యక్రమంలో ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టీజీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డును దున్నేసినందుకు
సిగ్గుపడాలి: నారా లోకేశ్

తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలో దారుణమైన ఘటన చోటుచేసుకుందని, వైసీపీ నాయకుల కక్షపూరిత చర్యలకు ఇది నిదర్శనమని ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ప్రజల కోసం రూ.4.75 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును, వేసిన నాలుగు రోజులకే వైసీపీ నేతలు ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. ఈ చర్య దిగ్భ్రాంతికరమని, సిగ్గుచేటని ఆయన అభివర్ణించారు. పుల్లంపేట మండలంలోని అనంతసముద్రం, పాపక్కగారిపల్లె గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఈ రోడ్డును నిర్మించామని లోకేశ్ తెలిపారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ ఫలించి రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో గ్రామస్థులు సంతోషంగా ఉన్నారని, కానీ వారి ఆనందాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని అన్నారు. ''ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం రాజకీయం అనిపించుకోదు. ఇది కచ్చితంగా ప్రజలపై జరిగిన అహంకారపూరిత దాడి. కక్ష సాధింపు చర్యలతో ప్రజాధనాన్ని ఇలా నాశనం చేయడం అత్యంత హేయమైన చర్య'' అని లోకేశ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనపై తక్షణమే స్పందించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌ను, జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఆయన కోరారు. ధ్వంసమైన రోడ్డును వీలైనంత త్వరగా పునరుద్ధరించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి అరాచక చర్యలను ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం నిందితులకు శిక్ష పడేలా చూస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రైవేటు బడుల్లో పేదలకు 25 శాతం సీట్లు!



హైదరాబాద్: రాష్ట్రంలోని నిరుపేద వర్గాల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించే వ్యవహారంలో ముందడుగు పడుతోంది. దశాబ్దాలు గడుస్తున్నా పలు రాష్ట్రాలు ఇప్పటికీ అమలు చేయకపోవడంపై ఇటీవల జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంఘం (ఎన్‌సీపీసీఆర్)పై సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 27న జరిగే విచారణకు స్వయంగా హాజరై అమలు తీరుపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఎన్‌సీపీసీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరగా.. పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ దిల్లీ వెళ్లి.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేస్తామంటూ ఆ సంఘానికి హామీ ఇచ్చారు.

చాలా రాష్ట్రాలు అమలు చేస్తున్నా..

విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1)(సి) ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలి. దీని అమలుపై ఈ ఏడాది జనవరిలో సుప్రీం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రవేశాల కోసం ప్రత్యేకంగా పోర్టల్ ప్రారంభించాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాలని, లాటరీ విధానంలో సీట్లు కేటాయించాలని,సమస్యలను పరిష్కరించేందుకు గ్రీవెన్స్ సెల్‌ను ప్రారంభించాలని.. ఇలా పలు నిబంధనలను విధించింది. అమలు, పర్యవేక్షణ బాధ్యతలను ఎన్‌సీపీసీఆర్‌కు అప్పగించింది. యూపీ, మహారాష్ట్ర, రాజస్థాన్, హరియాణా, తమిళనాడు తదితర రాష్ట్రాలు విధివిధినాలు రూపొందించుకొని అమలు చేస్తున్నాయి.

గత ఏడాది తూతూమంత్రంగా..

తెలంగాణలో ఈ చట్టం అమలుపై హైకోర్టులో గత ఏడాదే పిటిషన్ దాఖలు కాగా.. అమలు చేస్తామంటూ విద్యాశాఖ న్యాయస్థానంలో అంగీకరించింది. ప్రభుత్వ బడులు అందుబాటులో లేని 96 ఆవాసాల్లో పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించేలా విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా 2025 జులైలో ఉత్తర్వులు జారీ చేశారు. కానీ కేవలం డీఈవోలకు ఉత్తర్వులు పంపి ఊరుకున్నారు. ఫలితంగా 202526, 202627 విద్యాసంవత్సరాల్లో 180 మంది మాత్రమే ప్రవేశాలు పొందినట్లు విద్యాశాఖ వర్గాల సమాచారం. సుప్రీం దృష్టిసారించిన నేపథ్యంలో దీని అమలుపై అధికారులు మళ్లీ కసరత్తు ఆరంభించారు.

విజయ్ పార్టీకి రూ.13.3 కోట్ల విరాళాలు..
99 శాతం ఇద్దరు మంత్రుల నుంచే!



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.13.3 కోట్ల స్వచ్ఛంద విరాళాలు అందాయి. ఈ మొత్తంలో దాదాపు 99 శాతం ఇద్దరు మంత్రుల నుంచే వచ్చినట్లు భారత ఎన్నికల సంఘానికి సమర్పించిన వివరాలు వెల్లడిస్తున్నాయి. క్రీడలు, ప్రజాపనుల శాఖ మంత్రి ఆధవ్ అర్జున, మరో మంత్రి ఆర్‌వీ రంజిత్‌కుమార్ ఈ విరాళాల్లో ప్రధాన భాగస్వాములుగా ఉన్నారు. ఎన్నికల సంఘానికి సమర్పించిన వివరాల ప్రకారం.. ఆధవ్ అర్జున రూ.8.2 కోట్లు విరాళంగా ఇచ్చారు. రంజిత్‌కుమార్ రూ.5 కోట్లు అందించారు. దీంతో పార్టీకి అందిన మొత్తం విరాళాల్లో అర్జున వాటా 60 శాతానికి పైగా ఉంది. టీవీకేకు అత్యధికంగా విరాళం ఇచ్చిన వ్యక్తిగా ఆయన నిలిచారు. ఈ ఇద్దరి విరాళాలతో పాటు మరో రెండు విరాళాలు కూడా పార్టీకి అందాయి. తూత్తుకుడి జిల్లా లయన్స్ టౌన్‌లో ఉన్న స్నో షో సంస్థ రూ.5 లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా ఇచ్చింది. అదే చిరునామాలో నమోదైన స్నో ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ సంస్థ కూడా మరో రూ.5 లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో అందించింది. ఓవరాల్ గా ఈ నాలుగు విరాళాల మొత్తం రూ.13.3 కోట్లుగా ఉంది. ఇదిలా ఉండగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో అన్నాడీఎంకే సుమారు రూ.161.35 కోట్ల స్వచ్ఛంద విరాళాలు అందుకున్నట్లు ఎన్నికల సంఘం గణాంకాలు వెల్లడించాయి. ఇందులో టైగర్ అసోసియేట్స్ సంస్థ రూ.135 కోట్లతో అతిపెద్ద విరాళదారుగా నిలిచింది. డీఎంకేకు ఇదే ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.191.19 కోట్ల విరాళాలు అందాయి. ఆ పార్టీకి కూడా టైగర్ అసోసియేట్స్ అత్యధికంగా రూ.125 కోట్లు ఇచ్చింది. కోల్‌కతాకు చెందిన ఈ లాటరీ సంస్థకు, తమిళనాడు లాటరీ వ్యాపారవేత్త శాంటియాగో మార్టిన్‌కు వ్యాపార సంబంధాలు ఉన్నట్లు కంపెనీ రికార్డులు సూచిస్తున్నాయి. ఆ సంస్థలో నియమిత భాగస్వామిగా ఉన్న సుబ్బయన్ నాగరాజన్.. మార్టిన్‌కు చాలాకాలంగా వ్యాపార సహచరుడిగా ఉన్నట్లు సమాచారం. సుప్రీంకోర్టు 2024 ఫిబ్రవరిలో ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. అంతకుముందు ఆ బాండ్లను అత్యధికంగా కొనుగోలు చేసిన సంస్థగా మార్టిన్‌కు చెందిన ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ సంస్థ నిలిచింది. పథకం రద్దు తర్వాత బహిర్గతమైన వివరాల ప్రకారం.. ఈ సంస్థ ఎన్నికల బాండ్ల ద్వారా డీఎంకేకు రూ.509 కోట్ల విరాళాలు అందించింది.

వందే భారత్ జోరు.. 180 కి.మీ. వేగంతో దేశీయ రైలు పరుగులు!

భారత రైల్వేల ఆధునికీకరణలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు దూసుకుపోతున్నాయి. పూర్తిగా దేశీయ సాంకేతికతతో రూపుదిద్దుకున్న ఈ సెమీహైస్పీడ్ రైళ్లు గంటకు 180 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని అందుకునే సామర్థ్యాన్ని విజయవంతంగా నిరూపించుకున్నాయి. అత్యాధునిక సౌకర్యాలు, మెరుగైన వేగంతో భారతీయ రైల్వేల ముఖచిత్రాన్నే మార్చేస్తున్న ఈ రైళ్లు.. 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో కీలక ముందడుగుగా నిలుస్తున్నాయి. 2019 ఫిబ్రవరిలో న్యూఢిల్లీవారణాసి మధ్య తొలి వందే భారత్ సేవలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తూ ఈ రైళ్ల నెట్‌వర్క్‌ను విస్తరించారు. ప్రస్తుతం దేశంలోని ముఖ్యమైన కారిడార్లలో 160కి పైగా వందే భారత్ రైళ్లు సేవలందిస్తున్నాయి. ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు, ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన ప్రయాణ అనుభూతిని అందించడం వీటి ప్రత్యేకత. ఇటీవల మధుర నాగ్‌దా, కోటానాగ్‌దా వంటి సెక్షన్లలో రైల్వే భద్రతా అధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన హైస్పీడ్ ట్రయల్స్ విజయవంతమయ్యాయి. ఈ పరీక్షల్లో చైర్ కార్, స్లీపర్ వెర్షన్ రైళ్లు గంటకు 180 కిలోమీటర్ల వేగాన్ని చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైళ్ల బ్రేకింగ్ వ్యవస్థ, రైడ్ క్వాలిటీ, ఇతర భద్రతా ప్రమాణాలను నిశితంగా పరిశీలించారు. అయితే, ట్రాక్ పరిస్థితులు, భద్రతా అనుమతుల ఆధారంగా వీటి కార్యాచరణ వేగాన్ని గంటకు 160 కిలోమీటర్ల వరకు పరిమితం చేస్తున్నారు. వందే భారత్ రైళ్లు 'ఆత్మనిర్భర్ భారత్' (స్వావలంబన భారతదేశం) స్ఫూర్తికి నిజమైన ప్రతిబింబమని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ ప్రయాణికుడు అభిప్రాయపడ్డారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యంలో ఈ రైళ్లు ఒక ముఖ్యమైన భాగమని అధికారులు పేర్కొంటున్నారు. భారత రైల్వేల భవిష్యత్ తరానికి ఈ రైళ్లు పునాది వేస్తున్నాయని గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. స్లీపర్ కోచ్‌ల రాకతో సుదూర ప్రయాణాలు కూడా మరింత సౌకర్యవంతంగా మారనున్నాయి.

ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు.. శాంతికి తాము సిద్ధమేనన్న జెలెన్‌స్కీ

యుద్ధాన్ని ముగించేందుకు తాము దౌత్యపరమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, రష్యా మాత్రం దాడులతోనే సమాధానమిస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. కాల్పుల విరమణ కోసం వచ్చిన ప్రతి ప్రతిపాదనకు తాము సానుకూలంగా స్పందించామని, కానీ రష్యా హింసామార్గం వీడటం లేదని ఆయన ఆరోపించారు. రష్యా సైన్యం బాలిస్టిక్ క్షిపణులు, వివిధ రకాల డ్రోన్లతో కీవ్‌తో పాటు పలు నగరాలపై విరుచుకుపడిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా తాము ఎదురుదాడికి దిగాల్సి వస్తోందని చెప్పారు. విన్నిట్సియా, కీవ్, మైకోలైవ్, ఖార్కివ్, ఒడెస్సా సహా 11 ప్రాంతాల్లోని ఇంధన మౌలిక సదుపాయాల కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని, వీటిలో పదికి పైగా కేంద్రాలు ధ్వంసమయ్యాయని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. "మేం ఈ యుద్ధాన్ని ఎన్నడూ కోరుకోలేదు. గౌరవప్రదంగా యుద్ధాన్ని ముగించేందుకు మా మిత్ర దేశాలు చేసిన ప్రతి ప్రయత్నాన్ని స్వాగతించాం. కానీ రష్యా మాత్రం పదేపదే బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్ దాడులు, హత్యలతోనే ప్రతిస్పందిస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఆపేందుకు లేదా ఉద్రిక్తతలను తగ్గించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఏమాత్రం ఆసక్తి లేదని ఆయన విమర్శించారు. గత కొంతకాలంగా అమెరికా తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు పరోక్షంగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాస్కోపై ఉన్న ఆంక్షలను వాషింగ్టన్ సడలించడం, రష్యా నుంచి డీజిల్ దిగుమతి చేసుకునేందుకు ఒప్పందం చేసుకోవడం వంటి చర్యలను ఆయన తప్పుబట్టారు. రష్యా దాడులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని గతంలో పంచుకున్న భాగస్వామ్య దేశాలు, ఇప్పుడు ఆ విషయంలో మౌనం వహిస్తున్నాయని వాపోయారు. అమెరికా తయారీ 'పేట్రియాట్' గగనతల రక్షణ వ్యవస్థల కొరత కూడా తమ దేశాన్ని రక్షణ పరంగా మరింత బలహీన పరిచిందని ఆయన పేర్కొన్నారు.



- "రెజీమ్ ఛేంజ్" అంటూ వ్యాఖ్యానించిన నేహా బోరా
- "రెజీమ్ ఛేంజ్" వ్యాఖ్యలపై కిరణ్

'రెజీమ్ ఛేంజ్'పై కిరణ్ రిజిజుకు శశిథరూర్ కౌంటర్

రిజిజు, శశి థరూర్ మధ్య మాటల యుద్ధం

- **భారత్ బంగ్లాదేశ్ కాదంటూ ప్రతిపక్షాలపై విరుచుకుపడిన కిరణ్ రిజిజు**
- **మా లక్ష్యం ఎన్నికల ప్రక్రియను కాపాడటమేనని స్పష్టం చేసిన శశి థరూర్**
- **ఓటర్ల జాబితా సవరణపై కొనసాగుతున్న రాజకీయ వివాదం**

దేశ రాజకీయాల్లో "రెజీమ్ ఛేంజ్" (అధికార మార్పిడి) అనే పదం పెను దుమారం రేపుతోంది. ఈ అంశంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ధీటుగా బదులిచ్చారు. తాము ఆశిస్తున్నది స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలే తప్ప, అప్రజాస్వామికంగా ప్రభుత్వాన్ని కూల్చడం కాదని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియను విమర్శిస్తూ జేఎన్‌యూ విద్యార్థి కార్యకర్త నేహా బోరా 'రెజీమ్ ఛేంజ్' అని వ్యాఖ్యానించిన వీడియో క్లిప్‌తో పాటు, ప్రతిపక్షాలకు మద్దతిచ్చే మరికొందరి దృశ్యాలను జత చేస్తూ కిరణ్ రిజిజు 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. "ఈ వ్యక్తులను చూడండి, వీరు అధికార మార్పిడికి ప్రయత్నిస్తున్నారు. ఒకటి మాత్రం గుర్తుంచుకోండి, భారత్ బంగ్లాదేశ్ కాదు. భారత యువత ఎంతో తెలివైన వారు, వారు దేశాన్ని నిర్మిస్తారు తప్ప నాశనం చేయరు" అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై శశిథరూర్ స్పందిస్తూ, "భారత్‌ను బంగ్లాదేశ్‌తో లేదా ఫ్రాన్స్‌తో పోల్చడం అసంబద్ధం. ఫ్రాన్స్‌లో జరిగినట్లుగా బస్సులను తగలబెట్టడం, పోలీస్ స్టేషన్లపై దాడులకు దిగడం వంటి హింసాత్మక చర్యలను మేమెప్పుడూ సమర్థించం. మేము కేవలం శాంతియుత నిరసనలకు మాత్రమే మద్దతు తెలుపుతాం" అని అన్నారు. 'రెజీమ్ ఛేంజ్' అనే పదాన్ని వక్రీకరించవద్దని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో ప్రజల పేర్లను అస్తవ్యస్తమైన, పాక్షికంగా చట్టవిరుద్ధమైన పద్ధతుల్లో తొలగించారని శశిథరూర్ ఆరోపించారు. "ఇది పూర్తిగా రాజ్యాంగపరమైన సమస్య. ఈ లోపాలను సరిదిద్దాలని మాత్రమే మేము కోరుకుంటున్నాము. అంతేకానీ, అక్రమ మార్గాల్లో ప్రభుత్వాన్ని కూలదోయాలనే ప్రయత్నం ఎంతమాత్రం కాదు" అని ఆయన వివరణ ఇచ్చారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు చనిపోయిన సంఘటన ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం,లింగరాంతండాలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగరాంతండకు చెందిన డీగ్రీ చదువుతున్న విద్యార్థి బానోతు అజయ్ (19) తన వ్యవసాయ బావిలో ఉన్న మోటారును ఉదయం ఆన్ చేయుటకు వెళ్ళి, తాడు సహాయంతో బావిలోకి దిగుతుండగా, తాడు జారి బావిలో పడి చనిపోయాడు.దీంతో తల్లి బానోతు వనిత ఫిర్యాదు మేరకు ఎస్సై సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.పోస్టు మార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పేద ఆర్యవైశ్య విద్యార్థినికి లాప్ టాప్ బహుకరణ



ప్రజాస్ఫూర్తి,సూర్యాపేట:పేద ఆర్యవైశ్యులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు అన్నారు. ఆర్యవైశ్యుల సమస్యలు తన దృష్టికి వస్తే వెంటనే పరిష్కారం చేయడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. తన ఇంటి వద్దకు సహాయం కోసం వచ్చే వారికి తప్పకుండా సహాయం చేస్తానని ఆయన చెప్పారు. హైదరాబాదులో ఘట్కేసర్ నందు గీతాంజలి బిటెక్ కళాశాల నందు బీటెక్ చదువుతున్న సూర్యాపేటకు చెందిన గోళ్ల నవ్య తండ్రి లక్ష్మయ్య వారి ఆర్థిక పరిస్థితి బాగాలేనందున అమ్మాయి విద్యాభ్యాసం కోసం లాప్ టాప్ అవసరం ఉండడంతో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు ను సంప్రదించారు. సోషల్ మీడియా ద్వారా చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ ఎన్నారై పోలిశెట్టి లక్ష్మణ్ బాబు తన సొంత ఖర్చులతో 90,000/వెచ్చించి హెచ్ పి లాప్ టాప్ ను కనుగోలు చేసి ఎన్ఆర్ఐ ద్వారా పంపించడం జరిగింది. సోమవారం నాడు సూర్యాపేట పట్టణంలోని బ్రాహ్మణపల్లి ఫంక్షన్ హాల్ నందు జరిగిన కార్యక్రమం లో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు ఆధ్వర్యంలో లాప్ టాప్ ను గోళ్ల నవ్య కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రదాన కార్యదర్శి బిక్కుమల్ల కృష్ణ, కోశాదికారి వుప్పల శ్రవణ్ కుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు వుప్పల సత్యనారాయణ,బండారు రాజా,చల్లా లక్ష్మికాంత్,మొరిశెట్టి కోటేశ్వరరావు, నూనె సత్యనారాయణ, తప్సి గాంధి, తోట శ్యామ్ ప్రసాద్,దేవరశెట్టి సత్యనారాయణ,మిట్టపల్లి రమేష్, సోమ వెంకటేశ్వర్లు, సోమ ప్రవీణ్, డోగుపర్తి ప్రవీణ్, చల్లా సత్యనారాయణ, గోపారపు రాజు, దేవరశెట్టి నాగరాజు, గుడిపాటి రమేష్, బోనగిరి కృష్ణ,దడిపల్లి శ్యామ్ సుందర్, బొల్లం సురేష్, కొండా శ్రీనివాస రావు, గుడుగుంట్ల విద్యాసాగర్, నవిలిపురి నరేందర్, వుప్పలంచు కృష్ణ,చిత్తలూరి శ్రీధర్ రావు,కుంచమర్తి రాజశేఖర్, శ్రీరంగం రాము తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

*** మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి నల్లగొండ :నల్లగొండ రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. దసరా పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని కోరారు.కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలకు ఈ పండుగ శుభాలను తీసుకురావాలని కోరారు. పరస్పర ప్రేమాభిమానాలు, సోదరభావం, మానవతా విలువలను పెంపొందించుకుంటూ దసరా పండుగను జరుపుకోవాలని సూచించారు.తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని, ప్రజల ఆశయాలు నెరవేరాలని మంత్రి కోమటిరెడ్డి ఆకాంక్షించారు.రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం,రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు.

మాతా రాణిని దర్శించుకున్న ఆదేశ్‌వర్ ప్రాపర్టీస్ సీఈఓ వై.జి. తేజారెడ్డి



మూసాపేట్ ,(ప్రజాస్ఫూర్తి): ఆదేశ్‌వర్ ప్రాపర్టీస్ సీఈఓ వై.జి. తేజారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి యువసేన ఆధ్వర్యంలోని మాతా రాణి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, యువసేన సభ్యులు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులు పొందిన తేజారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత విగ్రహం వద్ద అన్నదానం కార్యక్రమం



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: అన్ని దానాలలో కంటే ఉత్తమమైనది అన్నదానం అని కూసుమంచి ఉప సర్పంచ్ చెన్ను వెంకటరమణ అన్నారు.సోమవారం శివాలయం రహదారి లో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా ఏర్పాటుచేసిన దుర్గామాత విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన అన్నదానం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ దుర్గ మాత కరుణాకటాక్షములు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ అన్నదాన కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, వెంకటేష్, నరేష్, మహేష్ బాబు, గోపి, నరేష్, విజయ్, పవన్, నరేష్, కే.శివ, గణేష్,అఖిల్, వేణు, టీ . శివ, మధు, శ్రీ రామ్, నాగరాజు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

బాధితుల పక్షాన పోలీసు వ్యవస్థ ఉండాలి



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :ఆదిలాబాద్ జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం 28 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకురాగా, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, బాధితుల సమస్యలపై సత్వరమే దర్యాప్తు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడూ బాధితుల పక్షాన నిలబడుతుందని, ప్రజలకు న్యాయం అందించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని అన్నారు. ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం ఉన్నా 8712659973 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి నిమర్జనం ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :సోమవారం మధ్యాహ్నం స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్ లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి నిమర్జనం బందోబస్తు కార్యక్రమంలో పాల్గొనే సిబ్బందికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ పలు సూచనలు చేయడం జరిగింది. మొదటగా జిల్లా ప్రజలందరికీ, పోలీసు సిబ్బందికి రేపటి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈరోజు దుర్గాదేవి నిమర్జనం ఉత్సవాలను మరియు, దసరా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. ఈరోజు నిర్వహించే దుర్గా నవరాత్రి నిమర్జనం ఉత్సవాలలో పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని. ఆదిలాబాద్ వన్ టౌన్, టూ టౌన్, మావల, పోలీస్ స్టేషన్లో పరిధిలో దాదాపు 85 దుర్గా దేవిల నిమజ్జన కార్యక్రమాలు జరగనున్నట్లు, దానికి జిల్లా పోలీస్ యంత్రాంగం 9 సెక్టార్లు విభజించి సిఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో పటిష్టమైన బందోబస్తులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళల ఉత్సవాలలో 50 మంది మహిళా పోలీసు సిబ్బందిచే, పటిష్టమైన షీ టీం బృందం చే బందు వస్తున్న ఏర్పాటు చేయడం జరిగింది. మహిళలు ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100 ద్వారా పోలీసు సహాయాన్ని పొందవచ్చును అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, ఏఆర్డిఎస్పి కమతం ఇంద్రవర్ధన్, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, ప్రేమ్ కుమార్, బి ప్రణయ్, రహీం పాషా, నైలు, ఆర్ ఐ లు డి వెంకటి , టి మురళి, ఎన్ చంద్రశేఖర్ ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ.. ఘనంగా అన్నదానం



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి:గరిడేపల్లి మండల కేంద్రంలో విజయ గణపతి యూత్ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు త్రిపురం అంజన్ రెడ్డి, పైడిమర్రి రంగనాథ్, పెండెం శ్రీనివాస్ గౌడ్, బండ నర్సిరెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు స్థానిక ఎస్సై బత్తిని శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి కి ప్రత్యేక పూజలు, నిర్వహించి గ్రామ ప్రజల సుఖసంతోషాలు ,ఆయురారోగ్యాలు,పాడిపంటల సమృద్ధి కోసం ప్రార్థించారు. అన్నదానం మహాదానం అనే స్ఫూర్తితో నిర్వహించిన అన్నదాన కార్య క్రమంలో భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.అమ్మవారి కృపతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ భక్తులు పూజల్లో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తి, సేవాభావం,సామాజిక ఐక్యతను చాటుతూ విజయ గణపతి యూత్ కమిటీ నిర్వహించిన కార్యక్రమం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపింది.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు,గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కనీసం గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా ఇళ్ల పట్టాల పంపిణీ ఎలా

*** గ్రామ సభ తీర్మానం లేని ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు రద్దు చేయాలి**

*** టీ డబ్ల్యూ ఎం ఎఫ్ జిల్లా ఇంచార్జీ గుండా ఉపేందర్ రెడ్డి**



కూసుమంచి, ప్రజాస్ఫూర్తి :కూసుమంచి మండల కేంద్రంలో క్యాంప్ కార్యాలయం లో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ పైన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాము. కనీసం గ్రామ సభ తీర్మానం లేకుండా ఇళ్ల పట్టాల పంపిణీ పేరుతో హడావుడి చేయడం హాస్యాస్పదం. కనీసం గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా హడావుడి ఎందుకో మంత్రి గారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. అసలు మనం రాజ్యంగా బద్దంగా ఎన్నికైన ప్రజాస్వామ్యం లో ఉన్నామా అని అనుమానం కలుగుతుంది. స్థానిక సంస్థల ను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నది.కాంగ్రెస్ పార్టీ ఎల్ ఓ పి నేత చెప్పే రాజ్యాంగం ఇదేనా, నీతులు ఎదుటి వారికి మాత్రమే కానీ మాకు కాదు అన్నట్లు ఉంది ప్రభుత్వం తీరు.మండల కేంద్రంలో యే ఒక్క గ్రామ పంచాయతీ లో ఐన తీర్మానం జరిగిందా, కనీసం వార్డు సభ్యులకు కూడా సమాచారం లేకుండా ఇళ్ల పట్టాల పంపిణీ చేయడం దుర్మార్గం. ఇట్టి చర్యను తెలంగాణ వార్డు మెంబెర్స్ ఫోరం జిల్లా తరపున ఖండిస్తున్నాం. వెంటనే ఇళ్ల పట్టాల పంపిణీ నిలిపివేసి, పాలక మండలి సభ్యులు తీర్మానం మరియు గ్రామ సభ లబ్దిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

యువత చెడు మార్గాలను వదిలి భక్తి మార్గంలో నడవాలి

– 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: యువత చెడును విడనాడి భక్తి మార్గంలో పయనించాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ అన్నారు.సోమవారం లక్ష్మీటాకీస్ ఏరియాలో బస్తీ యూత్, పెద్దలు మహిళల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీశ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి మండపంలో హోమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన మహాన్నదాన కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడుతూ యువత, పెద్దలు, మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో కులమతాలకతీతంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. అనంతరం దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామవరం ఓల్డ్ మార్కెట్ ఏరియాలోని శ్రీ సీతారామ హనుమాన్ శివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద సోమవారం కుంకుమ పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు గిరిధరాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు చెనిగరపు నరేష్, జిత్తుక దిలీప్, శ్రీకాంత్, కడలి మహేష్, రాజేశ్వరావు అశోక్, లగ్గాల వంశీ, రాజు, మని, సదానందం, బానోత్ చందర్, గుగులోత్ శంకర్, వంశీ, బన్సీలాల్, సునీత, సౌమ్యశ్రీ, అనసూయ, బానోతు జానకి, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి గాయాలు



ప్రజాస్ఫూర్తి ,జన్నారం:మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కవ్వాల్ అస్సలు తండా గ్రామపంచాయతీ పరిధిలోని నాయకపు కూడా కు చెందిన రవి, తండ్రి : చిన్న భీమయ్య సోమవారం రోజున మేకల మేకలను మేపుతుండగా అతనిపై ఎలుగుబంటి దాడి చేసింది, ఈ సంఘటనలో రవికి తీవ్ర గాయాలయ్యాయని, స్థానికులు తెలిపారు, సమాచారం అందుకున్న 108 వాహనం సిబ్బంది రఫిక్, రమేష్, లు వైద్యం నిమిత్తం లక్షెట్టిపేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని 108 సిబ్బంది తెలిపారు.

మాజీ ఎంపీటీసీ కి బిఆర్ఎస్ నాయకులు పరామర్శ

*** మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుగులోతు నీలాహేమ్లా నాయక్**



గరిడేపల్లి,ప్రజాస్ఫూర్తి: గరిడేపల్లి మండల పరిధిలో ఉన్న గారకుంట తండ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గుగులోతు వెంకట్రాం నాయక్ గత వారం రోజుల క్రితం సోమాజిగూడ అపోలో హాస్పిటల్ లో ఎడమ చేవికి శాస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన సందర్భంగా గ్రామ బి ఆర్ ఎస్ నాయకులు వారి స్వగృహానికి వెళ్లి ఆత్మీయంగా పలకరించి వారిని మనోధైర్యం కల్పించారు ఆరోగ్య పరిస్థితిల్లో మనోధైర్యం చెందుద్దని అండగా ఉంటామని వారిని పరామర్శించారు ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ నాయకులు గుగులోతు బాలు నాయక్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు సందీప్ నాయక్, మాజీ నీటి సంఘం డైరెక్టర్ వెంకట్రాం నాయక్, సర్దార్ నాయక్, నరేందర్ నాయక్, లకుపతి నాయక్, రవీందర్ నాయక్, నందా నాయక్, శ్రీను నాయక్, బచ్చలకూరి కోటయ్య, నాగు నాయక్, లింగ నాయక్, లాలు నాయక్, గాంధీలాల్ రవి నాయక్, శ్రీను, డోల, తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరపురం దుర్గాభవాని మహాక్షేత్రానికి భవాని స్వాముల పాదయాత్ర



హత్నూర, (ప్రజాస్ఫూర్తి):సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని నస్తీపూర్ గ్రామానికి చెందిన జై భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భవాని స్వాములు ఈశ్వరపురంలోని సప్తప్రాకారయుత శ్రీ దుర్గా భవాని మహాక్షేత్రం వరకు భక్తిశ్రద్ధలతో పాదయాత్ర నిర్వహించారు. అమ్మవారి నామస్మరణలు, భక్తి నినాదాలతో సాగిన ఈ పాదయాత్ర ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రమీల సాయిలు ఉపసర్పంచ్.మహేందర్‌తో పాటు పలువురు భవాని స్వాములు, భక్తులు, మహిళలు, చిన్నారులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.

గాంధీ కాలనీలో భక్త జన సమూహం మధ్య అన్నదానం



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం :చుంచుపల్లి మండలంలోని రామాంజనేయ కాలనీలో గల గాంధీ కాలనీ లో ఏర్పాటుచేసిన దుర్గామాత మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని విద్యానగర్ కాలనీ ఉపసర్పంచ్, సీపీఐ పార్టీ చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం మహాదానమని, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం ఎంతో గొప్ప సేవ అని , ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని, సేవాభావాన్ని పెంపొందిస్తాయని ఆయన అంటూ , అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం పట్ల మండప కమిటీ సభ్యులను , స్థానికులను ఆయన అభినందించారు .ఈ కార్యక్రమంలో రామాంజనేయ కాలనీ ఉపసర్పంచ్ కోడూరి నాగేష్, స్థానికులు, కాలనీ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పూల వేడుకలతో గ్రామీణ సంస్కృతికి జీవం

*** ఎమ్మెల్యే కూనంనేని**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం: సద్దుల బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకుని చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో గల చింతలచెరువు బతుకమ్మ ఘాట్ దగ్గర బతుకమ్మ వేడుకలలో మహిళలు ఆటపాటలతో జరుపుకుంటున్న వేడుకలను ఆయన నేరుగా సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు , సామూహిక బతుకమ్మల నిమజ్జనోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగలు మానవ సంబంధాలను బలోపేతం చేస్తాయని, ఆడపడుచుల ముఖాల్లో ఆనందం నింపే ఇలాంటి మహోన్నత సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని, పండుగ సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి ,గ్రామ సర్పంచ్ భూక్య శాంతి శ్రీ , వివిధ వార్డ్ మెంబర్స్ , గ్రామపంచాయతీ , పోలీస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

*** ఫామ్-18 నమోదుతో ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి:వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి, హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రం గరిడేపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. యువత, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అర్హులైన పట్టభద్రులందరూ ఫామ్18 ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. హైదరాబాద్, బెంగళూరు,ఢిల్లీ తదితర ప్రాంతాల్లోనివసిస్తున్న పట్టభద్రులు సైతం తమ ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా నమోదు చేసుకోవాలని ఇరువురు నాయకులు విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఫామ్ 18 సమర్పించి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. యువత, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ తరఫున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం బంగారు రాష్ట్రం గా మారాలంటే మళ్ళీ కారే రావాలని ప్రజలు కోరుతున్నారని వారు అన్నారు. విద్యా ఉద్యోగం ఉపాధి రంగాలలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు

మ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలి

: ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి: అమ్మ వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులు అన్నారు. సోమవారం సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఏర్పాటుచేసిన దుర్గామాత నవరాత్రి మండపాల వద్ద నిర్వహించిన అమ్మ వారి ప్రత్యేక పూజల్లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులుపాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాచుపల్లి కౌసల్య కాలనీలోని శ్రీ వెంకట రామాలయం,నిజాంపేట్ డివిజన్ లోని దుర్గా మాత ఆలయం, బండారి లేఔట్ కట్ట మైసమ్మ ఆలయంలో, నిజాంపేట్ డివిజన్ కేటీఆర్ కాలనీలో అసోసియేషన్ సభ్యులు వార్లు ఏర్పాటు చేసుకున్న దుర్గా దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ శక్తి స్వరూపిణీ, ఆదిపరాశక్తి అయిన దుర్గామాత దయతో ప్రజలంతా ఆయురోరోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ బీఆర్ఎస్ సర్కిల్ ప్రెసిడెంట్ రంగరాయ ప్రసాద్, మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగరాజు యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఆగం రాజు ముదిరాజ్, ప్రణయ ధనరాజ్, దేవి చందు,రవికిరణ్, మరియు నాయకులు, యువకులు, అసోసియేషన్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ వాకింగ్ ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌ల పరిశీలనకు కలెక్టర్ స్వయంగా వస్తానని హామీ

*** ఆప్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ వినతి**



ప్రజాస్ఫూర్తి ,భైంసా:నిర్మల్ లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు, వాకింగ్ ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌ల నిర్వహణలో నిర్లక్ష్యంపై ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ కలెక్టర్‌కు నేరుగా విన్నవించారు. 2024 నుంచి ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు తెలియజేస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడంతోనే పరిస్థితి ఇంత తీవ్రంగా మారిందని ఆయన స్పష్టం చేశారు.షాపింగ్ మాల్స్ కారణంగా ఫుట్‌పాత్‌లపై అడ్డంకులు ఏర్పడి, ప్రజలు వాకింగ్ ట్రాక్‌లపై నడవలేక రోడ్లపైకి రావాల్సి వస్తోందని వివరించారు.ఫుట్‌పాత్‌ల నిర్మాణం కోసం కేటాయించిన రూ.6 కోట్ల నిధుల వినియోగంపై కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయికి వచ్చి వాకింగ్ ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌లను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమస్యను పరిష్కరించాలని సయ్యద్ హైదర్ కోరారు.ఈ కార్యక్రమంలో ఆప్ జిల్లా జనరల్ సెక్రటరీ సీ.హెచ్. వినోద్, ట్రెజరర్ అబ్దుల్ సాధిక్, టౌన్ ప్రెసిడెంట్ రవి, స్పోక్స్‌పర్సన్ వసంత్ రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి మెరుగు రాజన్న, చొక్కాల భూమన్న, లాయర్ అరవింద్, షేక్ ఇమామ్, షైక్ షాదుల్లా తో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలపిట్టను బంధించడం చట్టరీత్యా నేరం...

*** ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: దసరా పండుగను పురస్కరించుకొని పాలపిట్టను బంధించడం పబ్లిక్ ఏరియాలో ప్రదర్శించడం చట్టరీత్యా నేరం అని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. సోమవారం కూసుమంచి మండలం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న బీట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తున్న కరపత్రాలను తహసిల్దార్ సైదులు, ఎంపీడీవోజశ్వంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీట్ ఆఫీసర్ మాట్లాడుతూ దసరా పండుగను పురస్కరించుకొని కొన్ని ప్రాంతాలలో పాలపిట్టను బంధించి చూపించడం జరుగుతుందని అలా పాలపిట్టను ఎవరైనా బంధించి జన సందర్శనార్థం ఏర్పాట్లు చేస్తే చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఎవరైనా పాలపిట్టను బంధించి ప్రదర్శిస్తే వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వన్యప్రాణి సంరక్షణ ప్రభుత్వ అన్ని శాఖల అధికారుల ప్రథమ కర్తవ్యమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాలపిట్టను రక్షించుకుందాం ప్రకృతిని కాపాడుకుందాం అనే నినాదంతో ప్రచార నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజావాణికి హాజరైన అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పశువుల తరలింపునకు పోలీసుల బ్రేక్

*** 10 పశువులు స్వాధీనం.. డ్రైవర్ అదుపులోకి.**



లింగాల ఘణపురం/జనగామ, ప్రజా స్ఫూర్తి : జిల్లా లోని లింగాల ఘణపురం మండలం నెల్లుట్ల శివారులోని ఓం శాం తి కాటన్ మిల్లు వద్ద అక్రమంగా పశు వులను తరలిస్తున్న మినీ గూడ్స్ వాహ నాన్ని పోలీసులు పట్టుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ బాబు తెలిపిన వివరాల ప్ర కారం సోమవారం తెల్లవారుజామున ఏరియా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ బి.యాదగిరి, కానిస్టేబుళ్లు బి.దేవాసింగ్, బి.శ్రీకాంత్‌లు అనుమా నాస్పదంగా కనిపించిన వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో 8 ఆవులు, 2 కోడెలు కలిపి మొత్తం 10 పశువులను ఇరుకుగా కట్టివేసి తరలిస్తున్నట్లు గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన డ్రైవర్ మహమ్మద్ ఆజంను అదుపు లోకి తీసుకున్నారు. పశువులను వధిం చేందుకు హైదరాబాద్‌కు తరలిస్తున్న ట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. అశోక్ లేలాండ్ బడా దోస్త్ మినీ గూడ్స్ వాహనం నంబర్ టీఎస్ 12 యూడి 4914ను స్వాధీనం చేసుకుని,పశువులను చల్లూ రులోని ధ్యాన్ గోశాలకు తరలించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ.. ఘనంగా అన్నదానం

*** శివలింగం ఆకారంలో లడ్డూ ప్రత్యేక ఆకర్షణ**



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి:గరిడేపల్లి మండలం వెంకట్రాంపు రం గ్రామంలో దుర్గ మాత కమిటీ ఆధ్వర్యంలో కుంకుమ పూజ, మహా అన్నదాన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి కి ప్రత్యేక పూజలు,కుంకుమార్చనలు నిర్వహించి గ్రామ ప్రజల సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు,పాడిపంటల సమృద్ధి కోసం ప్రార్థించారు.అన్నదానం మహాదానం అనే స్ఫూర్తితో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.అమ్మవారి కృపతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ భక్తులు పూజల్లో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తయారు చేసిన శివలింగం ఆకారంలోని లడ్డూ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.భక్తి, సేవాభావం,సామాజిక ఐక్యతను చాటుతూ దుర్గ మాత కమిటీ నిర్వహించిన కార్యక్రమం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపింది.ఈ కార్యక్రమంలో దుర్గ మాత కమిటీ సభ్యులు,గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖలో క్రియాశీలక మార్పు

హైదరాబాద్: రాష్ట్ర పోలీసు యంత్రాంగంలో క్రియాశీలక మార్పు రాబోతోంది. కొత్తగా శిక్షణ పూర్తిచేసుకున్న 112 మంది డీఎస్పీలు అందుబాటులోకి రానున్నారు. కొన్ని సంవత్సరాలుగా నడుస్తున్న 1995, 96 బ్యాచ్‌లకు చెందిన డీఎస్పీల పదోన్నతుల వివాదం పరిష్కారం దిశగా కదులుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన వివిధ విభాగాలకు అధికారుల కొరత తీరనుంది.. కసరత్తు మొదలైంది. తెలంగాణ పోలీసు అకాడమీలో ఇటీవల 112 మంది డీఎస్పీలు శిక్షణ పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. వారికి పోలీసు శాఖలో అంతర్గతంగా గ్రేహౌండ్స్ తదితర విభాగాల్లో మరికొంత క్షేత్రస్థాయి శిక్షణ ఇస్తారు. అనంతరం ప్రొబెషనరీలుగా బాధ్యతలు అప్పగిస్తారు. దానికి మరికొన్ని నెలల సమయం పడుతుంది.

కోర్టు కేసులు ఉపసంహరించుకుంటుండడంతో...

ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 450 మంది డీఎస్పీలు అందుబాటులో ఉన్నారు. 1995, 96 బ్యాచ్‌లకు సంబంధించి నెలకొన్న వివాదం నేపథ్యంలో గత భారాస ప్రభుత్వం ఒకేసారి సుమారు 140 డీఎస్పీ స్థాయి సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించింది. అంతమంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతులు ఇచ్చింది. వారందరినీ సర్దుబాటు చేయడం ఒక దశలో కష్టంగా మారింది. ఆ తర్వాత కొత్తగా ఏర్పడ్డ ఈగల్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, హైడ్రా వంటి విభాగాల వల్ల కొంత వెసులుబాటు లభించింది. ఇప్పుడు కొత్తగా మరో 112 మంది డీఎస్పీలు అందుబాటులోకి రానున్నారు. వారు అందుబాటులోకి వచ్చేలోపే కొంత మందికి అదనపు ఎస్పీలుగా పదోన్నతి ఇవ్వాల్సి ఉంది. అయితే 1995, 96 బ్యాచ్‌ల వివాదం పదోన్నతులకు అడ్డంకిగా ఉంది. ఇటీవల ఈ రెండు బ్యాచ్‌లకు చెందిన అధికారులతో డీజీపీ సీవీ ఆనంద్ సమావేశం ఏర్పాటు చేశారు. వివాదం కొనసాగినంతకాలం పదోన్నతులు రావు కాబట్టి అందరికీ అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. ముందు కోర్టు కేసులు ఉపసంహరించుకుంటే అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. దాంతో చాలామంది కోర్టు కేసులు వెనక్కి తీసుకున్నారు. ప్రస్తుతం అదనపు ఎస్పీ స్థాయిలో 37 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి సన్నాహాలు మొదలయ్యాయి.

శ్రీరాజ్యలక్ష్మీ ఇండస్ట్రీస్లో ఘనంగా విజయదశమి వేడుకలు



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి:విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పంచశీలకాలనీలో నిశ్రీరాజ్యలక్ష్మీ ఇండస్ట్రీస్లో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి అధ్యక్షులు,రాజ్యలక్ష్మీ ఇండస్ట్రీస్ అధినేత,ప్రముఖ పారిశ్రామికవేత్త లయన్ డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి పూజలు ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా పరిశ్రమలోని యంత్రపరికరాలను, ఆయుధ, వాహన పూజలునిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మధుసుదన్,జుంజునవాలా,హమీద్,వెంకట్రెడ్డి,పిచ్చిరెడ్డి,మనోహర్,కిషోర్బాబు,చంద్రశేఖర్తదితరులుపాల్గొన్నారు.

శ్రీరాజ్యలక్ష్మీ ఇండస్ట్రీస్లో ఘనంగా విజయదశమి వేడుకలు

జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి:విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పంచశీలకాలనీలో నిశ్రీరాజ్యలక్ష్మీ ఇండస్ట్రీస్లో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి అధ్యక్షులు,రాజ్యలక్ష్మీ ఇండస్ట్రీస్ అధినేత,ప్రముఖ పారిశ్రామికవేత్త లయన్ డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి పూజలు ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా పరిశ్రమలోని యంత్రపరికరాలను, ఆయుధ, వాహన పూజలునిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మధుసుదన్,జుంజునవాలా,హమీద్,వెంకట్రెడ్డి,పిచ్చిరెడ్డి,మనోహర్,కిషోర్బాబు,చంద్రశేఖర్తదితరులుపాల్గొన్నారు.

ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలి

*** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ :ఎల్ఎనినో నేపథ్యంలో రానున్న 300 రోజులు అత్యంత కీలకమని, తాగు, సాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని, ముఖ్యంగా డిసెంబర్, జనవరి నెలల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా ఇప్పటి నుండే అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గ్రామాలు, మున్సిపల్ పట్టణ ప్రాంతాలలో తాగునీటికి ఇబ్బంది రాకుండా వచ్చే ఆగస్టు వరకు నీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.గ్రామపంచాయతీల్లో నీటి వనరులకు సంబంధించిన రిజిస్టర్లను నిర్వహించాలని, నీటి సరఫరా వ్యవస్థలో లీకేజీలను అరికట్టాలని, పాడైన పైపులు, ట్యాంకులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. పబ్లిక్ హెల్త్ శాఖ, మిషన్ భగీరథ, అమృత్ పథకం అధికారులతో సమన్వయం చేసుకొని నీటి సరఫరా ప్రణాళికను సిద్ధం చేయాలని చెప్పారు.పట్టణ ప్రాంతాల్లోనూ నీటిని పొదుపుగా వినియోగించే విధానాలను అమలు చేయాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి టి. శేఖర్ రెడ్డి ,జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. కాగా ఈ సోమవారం రెవిన్యూ శాఖకు(21) ఫిర్యాదులు, ఇతర శాఖలకు(28) ఫిర్యాదులు మొత్తం(49) ఫిర్యాదులు వచ్చాయి.

చిగురుమామిడి మండల ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు

*** చిగురుమామిడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అందే సురేష్.**



చిగురుమామిడి,ప్రజాస్ఫూర్తి:చిగురుమామిడి మండల ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ విజయదశమి (దసరా) పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతమైన దసరా పండుగను మండల ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య, సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఆశించిన ఆశయాలు, లక్ష్యాల సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అందే సురేష్ స్పష్టం చేశారు. మంత్రి నేతృత్వంలో మండల అభివృద్ధికి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నిరంతరం శ్రమిస్తామని తెలిపారు.

చిగురుమామిడి మండల ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు

*** చిగురుమామిడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అందే సురేష్**




చిగురుమామిడి,ప్రజాస్ఫూర్తి:చిగురుమామిడి మండల ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ విజయదశమి (దసరా) పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతమైన దసరా పండుగను మండల ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య, సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఆశించిన ఆశయాలు, లక్ష్యాల సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అందే సురేష్ స్పష్టం చేశారు.

మేడిగడ్డ సాకుతో రైతులకు అన్యాయం చేయొద్దు

*** నవంబర్ నెలాఖరులోగా కాఫర్ డ్యాం పనులు ప్రారంభించాలి: కల్వకుంట్ల కవిత**





భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): మేడిగడ్డ బ్యారేజీ సమస్యను సాకుగా చూపి రైతులకు సాగునీరు అందకుండా చేయొద్దని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాజెక్టు కన్నెపల్లి పంప్హౌస్ను నాయకులతోకలిసిఆమెసందర్శించారు.కన్నెపల్లి పంప్హౌస్ వద్ద 93 మీటర్ల ఎత్తులో కాఫర్ డ్యాం నిర్మించి ప్రాణహిత నీటిని మళ్లిస్తే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు నీటిని ఎత్తిపోసే అవకాశం ఉంటుందని తెలిపారు.నవంబరు నెలాఖరులోగా పనులు ప్రారంభించకపోతే పంప్హౌస్ వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సుమారు రూ.25 కోట్లతో నెలన్నరలో కాఫర్ డ్యాం నిర్మాణం పూర్తి చేయవచ్చని, తద్వారా మేడిగడ్డపై ఆధారపడకుండా అనుసంధానిత ప్రాజెక్టుల్లో నీటిని నింపుకోవచ్చని వివరించారు. ఈ ప్రతిపాదనకు సంబంధించిన సాంకేతిక వివరాలను ప్రభుత్వానికి అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.ప్రాణహితలో రోజుకు రెండు టీఎంసీల నీరు ప్రవహిస్తున్నా వినియోగించుకోలేకపోతున్నామని విమర్శించారు. వచ్చే ఏడాది ఎల్ఎనినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలపై ఆందోళన ఉన్నందున అందుబాటులో ఉన్న జలాలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఇంజినీర్లు సాంకేతిక మార్పులు సూచిస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గోదావరి, కృష్ణా జలాలను సమర్థంగా వినియోగించుకుంటే రాష్ట్రంలో కరువు పరిస్థితులను నివారించవచ్చని కవిత పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల పక్షాన నిలబడి ఉంది

: అంజన్ రెడ్డి



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి:కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు పేద ప్రజల పక్షాన నిలబడి ఉందని గరిడేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు త్రిపురం అంజన్ రెడ్డి అన్నారు. సోమవారం గరిడేపల్లి మండలం గారకుంటతండ గ్రామంలో నిరుపేద ప్రజలకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు పట్టాల పంపిణీ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాణోతు అరుణ రమేష్ నాయక్ తోకలిసి పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం గ్రామంలో 25 మందికి ఇల్లు పట్టాలు మంజూరు అవడంతో పాటు మరో 08 మందికి త్వరలోనే మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో గ్రామంలో మిగిలిన ఉన్న నిరుపేదలను గుర్తించి స్థానిక మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో నూతన ఇందిరమ్మ ఇళ్లులు మంజూరు అయ్యేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాం రెడ్డి, గరిడేపల్లి మాజీ సర్పంచ్ బాణోతు సైదానాయక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సురభి సైదులు, ఉప సర్పంచ్ గౌతమి సుధాకర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వార్డు సభ్యులు జయరాం, జలేంధర్, భూలీ బాయి, ఝాన్సీ, సక్కి, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాణోతు వీరునాయక్, గ్రామ పెద్దలు, మహిళలు, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆపదలో కాంగ్రెస్ ఆపన్న హస్తం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి :మహబూబాబాద్ పట్టణ కేంద్రానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్,ఎంపీ పోరిక బలరాం నాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ జ్యోతి రమేష్ నాయక్ మాట్లాడుతూ,పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ, వైద్యానికి అప్పులు చేస్తున్న పేద,మధ్య తరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో భరోసానిస్తోందని తెలిపారు. పట్టణ అభివృద్ధితో పాటు, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు భూక్యా దాల్ సింగ్,కౌన్సిలర్లు నీరుటి లక్ష్మీనారాయణ, బొల్లు రాజు, సాల్వాయి దిలీప్, గాడిపెల్లి చరణ్, మండల అధ్యక్షులు బెల్లంకొండ శ్రీనివాస్ గౌడ్,మాజీ మండల అధ్యక్షులు చిట్టి వెంకన్న గౌడ్,జిల్లా నాయకులు ఎడ్ల రమేష్,మాజీ కౌన్సిలర్లు,పట్టణ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, పాత్రికేయ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్



ప్రజాస్ఫూర్తి,భైంసా:గ్రామాల అభివృద్ధే ధ్యేయం గా తాను ముందుకు సాగడం జరుగుతుందని ప్రణాళిక ప్రకారం అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా బైంసా మండలంలోని బోరిగాం గ్రామంలో 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన ఐకెపి భవన ప్రారంభం, వానల్ పాడ్ గ్రామంలో 50 లక్షల రూపాయలు నిధులతో నిర్మించిన సిసి రోడ్లు, 10 లక్షల నిధులతో నిర్మించిన ఐకెపి భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ముధోల్ నియోజకవర్గం లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ఐకెపి భవనాలు నిర్మాణం పూర్తి చేసి రాష్ట్రంలోనే నియోజకవర్గ ప్రథమ స్థానంలో ఉందన్న విషయాన్ని చెప్పారు. మూడు సంవత్సరాల్లో వానల్ పాడ్ గ్రామానికి ఒక కోటి 90 లక్షల రూపాయల నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. బోరిగాం గ్రామానికి గ్రామ పంచాయతీ భవనం, అంగన్వాడి భవన నిర్మాణానికి నిధులు ఇస్తానన్నారు. గ్రామస్తులు అడిగిన సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. బోరిగాం గ్రామంలో అంగన్వాడి భవన నిర్మాణానికి స్థలం లేకపోవడంతో గ్రామానికి చెందిన శివరాం పటేల్ ముందుకు రావడంతో దాతను సన్మానించారు.

*** ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే**

వానల్ పాడ్ గ్రామంలో చింత చెట్టు కాండానికి స్వయంభు గా వెలసిన దుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తో పాటు వచ్చిన సర్పంచ్ లను నాయకులను సన్మానించారు.ఐకెపి భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కు మహిళలు ఘన స్వాగతం పలికారు. డప్పు చప్పులతో,పూలు చల్లుతూ ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కార్యక్రమాల్లో స్థానిక సర్పంచ్ లు నాగలక్ష్మి వినోద్,బోరిగాం సర్పంచ్ వందన లక్ష్మణ్, మున్సిపల్ చైర్మన్ తూమోల్ల దత్తాత్రి,మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్ బైంసా మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు పండిత్ రావ్ పటేల్, బైంసా మండల బిజెపి అధ్యక్షురాలు దేగాం సర్పంచ్ సిరం సుష్మరెడ్డి, అధికారులు, సర్పంచ్ లు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సద్దుల సంబరం

*** ఆడి పాడిన యువతులు , మహిళలు**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం :చుంచుపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నుంటాయి . వివిధ గ్రామాలలోని సెంటర్ల నందు మహిళలు తీరోక్క పూలతో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ మహిళలు , యువతలు , చిన్నారులు బతుకమ్మలలో ఉత్సాహంగా పాల్గొన్నారు . అనంతరం వివిధ గ్రామాలలోని చెరువులు , కుంటలు ,కాలువలలో బతుకమ్మలకు పూజలు చేసి నీళ్లలో వదిలిపెట్టారు .

ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

*** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజాస్ఫూర్తి,భైంసా:ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా,ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. అనంతరం జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్ ఆధ్వర్యంలో 'ఫైనాన్షియల్ ఇన్క్లూజన్ సాచురేషన్ క్యాంపెయిన్' కు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 21వ తేదీ నుంచి నెలరోజు 'ఫైనాన్షియల్ ఇన్క్లూజన్ సాచురేషన్ క్యాంపెయిన్' కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించాలని తెలిపారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ డి.ఎస్.పి కి శ్రీ పెద్ద భీమన్న స్వామి జాతర ఆహ్వాన పత్రిక అందజేత



ప్రజాస్ఫూర్తి,భైంసా: నిర్మల్ జిల్లా మామడ మండలం పొతారం గ్రామంలో ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ పెద్ద భీమన్న స్వామి వారి జాతర మహోత్సవ ఆహ్వాన పత్రికను నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్, సోన్ సిఐ గోవర్ధన్ రెడ్డి కి నాయకపోడ్ సేవా సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా అందజేశారు.ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం సాంప్రదాయబద్ధంగా నిర్వహించే శ్రీశ్రీశ్రీ పెద్ద భీమన్న స్వామి జాతర ఈనెల 21102026 (బుధవారం) నుండి 26102026 (సోమవారం) వరకు వైభవంగా జరగనుందని తెలిపారు. జాతర ఉత్సవాల్లో భాగంగా అక్టోబర్ 21 బుధవారం సాయంత్రం 7:30 గంటలకు స్వామి వారిని గుడి నుండి మరం (ఇంటి) వద్దకు తీసుకురావడం జరుగుతుందన్నారు. అనంతరం అక్టోబర్ 22, 23, 24 తేదీలలో పరిసర ప్రాంతాల గ్రామాల్లో స్వామి వారి ఊరేగింపు నిర్వహించి, 24వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటలకు స్వామి వారు తిరిగి పోతారం మరం వద్దకు చేరుకుంటారని వెల్లడించారు. అలాగే అక్టోబర్ 25 ఆదివారం ఉదయం 8 గంటల నుండి ఊరేగింపు, సాయంత్రం 6 గంటలకు గంగ స్నానం, రాత్రి 12:30 గంటలకు గుడి వద్దకు గజాలు చేరుకుంటాయని తెలిపారు. చివరి రోజు అక్టోబర్ 26 సోమవారం ఉదయం 7 నుండి 8 గంటల వరకు బండారు వసంతం, అనంతరం భక్తుల మొక్కుల చెల్లింపుతో జాతర మహోత్సవం ముగుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య, జిల్లా ఉపాధ్యక్షులు సంచు శ్రీనివాస్, సత్యనారాయణ, రామకృష్ణ, పోతారం గ్రామ ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాల అమలు ఆగదు

*** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మంత్రి, కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండలం ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నవరాత్రులలో అమ్మవారిని నిష్టతో పూజించి, మనసులోని కోరికలన్నీ విజయదసమి రోజున అమ్మవారు తీర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. గతంలో ఎన్నికల సమయంలో బొమ్మలు చూపించి, సినిమాటిక్ గా ప్రకటనలు చేసి మోసం చేసిన ప్రభుత్వాలలా కాకుండా, అర్హులైన పేదవాడెవరూ నష్టపోకుండా ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కల నెరవేర్చాలనేదే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు, హైదరాబాదులో లక్ష ఇళ్లు మంజూరు చేయడమే కాకుండా, హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులు ప్రారంభించామని మంత్రి తెలిపారు. గ్రామీణ, తండా ప్రాంతాల్లో కూడా విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 30 వేల నుంచి 2 లక్షల 40 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఇప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 40 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, ఇంకా ఎంత ఖర్చయినా మూడో, నాలుగో విడతల్లో ఇళ్లు కట్టిస్తామని, అర్హులందరికీ అందజేస్తామని మంత్రి అన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుందని మంత్రి అన్నారు. ప్రతిపక్ష శాసనసభ్యుల నియోజకవర్గాల్లో కూడా పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. సన్నబియ్యం, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ. 500 లు సన్నబియ్యానికి బోనస్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు భీమా అందిస్తున్నామని, మహిళలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం ఇప్పటికే 73 వేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని, మరో 14,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చామని, త్వరలో మరిన్ని ఇవ్వబోతున్నామని తెలిపారు. గత 33 నెలల్లోనే కేవలం మహిళా సంఘాలకు రూ. 73 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించామన్నారు. పేదవాడి కష్టం తెలిసిన మన ప్రభుత్వం, పేదవాడి ముఖంలో ఆనందం చూడటమే లక్ష్యంగా పనిచేస్తోందని స్పష్టం చేస్తూ, రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పీ. శ్రీనివాస రెడ్డి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, కూసుమంచి మండల ఎంపీడీవో జశ్వంత్ కుమార్, తహశీల్దార్ సైదులు, హౌజింగ్ డీఈ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడిలో ఘనంగా ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం



చిగురుమామిడి,ప్రజాస్ఫూర్తి:కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ ఖండ కు చెందిన చిగురుమామిడి మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విజయదశమి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్వయంసేవకులు సంప్రదాయ గణవేష్ ధరించి శస్త్ర పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎస్ఎస్ కరీంనగర్ ప్రచార ప్రముఖ్ గీకూరి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి,శమీ పూజ నిర్వహించిన అనంతరం స్వయంసేవకులను ఉద్దేశించి ప్రసంగించారు.విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని,సమాజంలో ధర్మాన్ని, సాంస్కృతిక విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఆర్ఎస్ఎస్ గత 100సంవత్సరాలుగా స్వచ్ఛందంగా దేశ సేవలో నిమగ్నమై ఉందని, వ్యక్తి నిర్మాణం ద్వారానే బలమైన,సమర్థవంతమైన దేశ నిర్మాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.ప్రస్తుత సమాజంలో యువత దేశభక్తిని పెంపొందించుకుని, సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. కుల, మత భేదాలు లేకుండా సమాజమంతా ఏకతా భావంతో ముందుకు సాగినప్పుడే సుదృఢ భారత్ సాధ్యమవుతుందని అన్నారు.ప్రతి స్వయంసేవకుడు పర్యావరణ పరిరక్షణ,కుటుంబ ప్రబోధన్, స్వదేశీ వస్తువుల వినియోగం వంటి పంచ పరివర్తన సిద్ధాంతాలను తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ ఖండ కార్యవాహ ఆవుల కుమార్,మొగిలి సంపత్,మురళి పెద్ద సంఖ్యలో స్వయంసేవకులు,సంఘ పరివార్ నాయకులు,ప్రముఖులుగ్రామస్థులు పాల్గొన్నారు.

వెట్టి చాకిరి నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి

*** స్వేచ్ఛా రథం'ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజాస్ఫూర్తి,భైంసా:వెట్టి చాకిరి నిర్మూలనకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, కార్మికుల హక్కులు, చట్టాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా వెట్టి చాకిరి నిర్మూలన, కార్మికుల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెట్టి చాకిరి వల్ల కలిగే అనర్థాలు, దాని నిర్మూలనకు ఉన్న చట్టాలు, కార్మికులకు కల్పించిన హక్కులపై నాటికలు, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించే ఈ ప్రచార రథం ద్వారా వ్యవసాయ రంగం, ఇటుక బట్టీలు, మైనింగ్, క్వారీలతో పాటు ఇతర రంగాల్లో పనిచేసే అసంఘటిత కార్మికులకు తమ హక్కులపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వెట్టి చాకిరికి గురైన వారు, అలాంటి ఘటనలను గుర్తించిన వారు వెంటనే ఫిర్యాదు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 08069434343ను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం వెట్టి చాకిరి నిర్మూలనకు సంబంధించిన గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెట్టి చాకిరి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, కార్మిక శాఖ అధికారి రాజలింగం, ప్రచార రథం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయుధాలు, వాహనాలకు పోలీసుల పూజలు

*** ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ సంకీర్త్**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సోమవారం ఆయుధ, వాహన పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆయుధాలకు, పోలీస్ వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, ఎస్పీ సీఐ నరేష్, టౌన్ సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు సంతోష్, రత్నం, పూర్ణచందర్‌తోపాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల వేతనం ఒక్క రూపాయా పెంచలేదు

మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపణ

సిద్దిపేట టౌన్ : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా పారిశుద్ధ్య కార్మికులకు ఒక్క రూపాయి వేతనం పెంచలేదని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కార్మికులను ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పండగపూట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితం.. పురుషులకు మాత్రం రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. జిల్లా కేంద్రం సిద్దిపేటలోని మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం సొంత ఖర్చులతో దుస్తులు పంపిణీ చేశారు.

బోనం..వైభవం..

- కన్‌సాన్‌పల్లిలో ఘనంగా దుర్గమ్మ తల్లికి బోనాలు



అందోలు, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ సంస్కృతికి నిలువుటద్దమై బోనాల పండుగ సంబరం అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో ఆద్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నవదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బోనాల వేడకను నిర్వహించారు. స్థానిక ఈశ్వరాలయం వద్ద బోనాల ఊరేగింపు ఏర్పాట్లు చేసి అక్కడి నుండి పోచమ్మ దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన దుర్గామాత మండపం వరకు బోనాల ఊరేగింపు సాగేలా ఏర్పాట్లు చేశారు. మహిళ భక్తులు పెద్ద ఎత్తున బోనాల వేడుకల్లో పాల్గొని బోనాలను ఎత్తుకొన్నారు. చిన్నారులు సైతం మంగళహారతుల చేతబట్టి తమ భక్తిని చాటుకున్నారు. డప్పు చప్పుల్లు, డిజే సౌండ్ భక్తి పాటల మధ్య ప్రారంభమైన బోనాల ఊరేగింపు ఆద్యాంతం వరకు అత్యంత వైభవంగా కొనసాగింది. బోనాలు ఆడపడుచుల నెత్తిన కిరిటంలా కనిపించాయి. బోనాల ఊరేగింపు గ్రామంలోని పురవీధుల గుండా బోనాల దీపాలు, మంగళహారతుల దీపాల వెలుగులు వీధులన్ని అందాన్ని సంతరించుకున్నాయి. బోనాలు వెలుగులు నింపినట్లుగా భక్తి పారవశ్యం ఉప్పొంగింది. దుర్గామాత మండపం వద్దకు చేరుకున్న బోనాలకు చిన్నారులు మంగళహారతులతో హారతులు ఇచ్చిన విధానం అక్కడున్నవారిని ఆకట్టుకోవడంతో పాటు బోనాల ఊరేగింపులోనే ప్రత్యేకతను సంతరించుకుంది. అనంతరం అమ్మవారి మండపం, పోచమ్మ దేవాలయం చుట్టు బోనాలతో ప్రదక్షిణలు చేసి అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించారు. అమ్మవార్ల దయతో గ్రామస్తులందరూ ఆయురారోగ్యాలు, పాడిపంటలతో సంతోషాంగా ఉండాలని వేడుకున్నారు.

ఉప్పొంగిన భక్తి పారవశ్యం..

దుర్గమ్మ తల్లికి నిర్వహించిన బోనాల ఊరేగింపు వేడుకలో మహిళలు సాంప్రదాయ పద్ధతిలో దుస్తులలో పాల్గొనడం గ్రామస్తుల్లో భక్తి పారవశ్యాన్ని నింపింది.డప్పు చప్పుల్లతో బోనాల ఊరేగింపు ముందుకు సాగగా అడుగడుగున ప్రజల నుండి అపూర్వ స్పందన లభించింది. సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా ఇతర గ్రామాల నుండి ఆడపడుచులతో పాటు బంధువులు బోనాల ఊరేగింపు వేడుకల్లో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. అమ్మవారి దయ తమపై ఉండి సుఖసంతోషాలను ప్రసాదించాలని అమ్మవారిని దర్శించుకున్నారు. సాంప్రదాయ బద్దంగా బోనాల వేడుకలను నిర్వహించడం పట్ల నవదుర్గా ఉత్సవ కమిటీ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

బతుకమ్మ ఆటలో ధోరణి మారింది



ప్రజాస్ఫూర్తి ,జన్నారం:జన్నారం మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలో బతుకమ్మ వేడుకల సంబరాలు అంబరాన్ని అంటాయి. పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైదానంలో విద్యుత్ కాంతులతో, పూల తోరణాలతో ప్రత్యేకంగా బతుకమ్మ రూపాన్ని తయారు చేయించారు. మహిళలకు పిల్లలకు పెద్దలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ హాజరు అయ్యి మన సాంప్రదాయమైన బతుకమ్మ గురించి మహిళల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా పొనకల్ గ్రామ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు తలమానికమైన బతుకమ్మ వేడుకల సంబరాలు ధోరణి మారింది అని, ఒకప్పుడు బతుకమ్మ ఆట అంటే బతుకమ్మల చుట్టూ లయబద్ధకంగా తిరుగుతూ పాటలకు అనుగుణంగా రెండు చేతులతో చప్పట్లు కొడుతూ ఆడేవారని,ఇప్పుడు ధోరణి మారిందని బతుకమ్మ వేడుకల సంబరాల్లో కోలాటాలు, (దాండియా) కనిపిస్తున్నాయని తెలిపారు. గణేశుని నవరాత్రుల, దేవీ నవరాత్రుల ఉత్సవాలు, ఆలయ బ్రహ్మోత్సవాలు లాంటి సందర్భాలలో కనిపించే కోలాటాలు ఇప్పుడు బతుకమ్మ వేడుకల సంబరాల్లో కనిపిస్తున్నాయని, కోలాటాల సంస్కృతి ఒక ప్రాంతానికే కాకుండా యావత్ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉందని,ఎక్కడ చూసినా కూడా కోలాటాలు (దాండియా) నే ఆడుతున్నారని అన్నారు.అలనాటి అమ్మమ్మలు,నానమ్మలు,అమ్మలు,పాత పద్ధతిలోనే బతుకమ్మ ఆడుతున్నప్పటికీ, ఇప్పటి యువతుల సంతోషాన్ని కాదన లేకుండా కోలాటంలో వారితో పాటు కొంతమంది పెద్దవారు కూడా కాలు కదుపుతున్నారని అన్నారు. భక్తి పాటలకు కోలాటమే అందంగా ఉంటుందని, బతుకమ్మ పాటలకు కూడా కోలాటం సరిగ్గా సరిపోతుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ జక్కు భూమేష్,అత్యధిక సంఖ్యలో పాల్గున్నారు.

పబ్లిక్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా మహోత్సవం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల మాజీ శాసనసభ్యులు, మాజీ మంత్రి స్వర్గీయ రాంరెడ్డి దామోదర్ రెడ్డి విగ్రహావిష్కరణ మహోత్సవం సూర్యాపేట పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రివర్యులు అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. స్వర్గీయ రాంరెడ్డి దామోదర్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఈ విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విగ్రహ ఆవిష్కరణ లో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు పాల్గొన్నారు. వేణారెడ్డి దామన్నతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేలా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ మహోత్సవానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు మాజీ ఎంపిటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, వివిధ స్థాయిల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, దామోదర్ రెడ్డి అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. స్వర్గీయ రాంరెడ్డి దామోదర్ రెడ్డి విగ్రహం ముందు కొప్పుల వేణారెడ్డి భావోద్వేగానికి గురై కన్నీటిపర్యంతమయ్యారు. తనకు అత్యంత ఆత్మీయుడైన నాయకుడి జ్ఞాపకాలను తలచుకుంటూ ఆయన కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడికి వచ్చిన అభిమానులను సైతం భావోద్వేగానికి గురిచేసింది. దామన్నతో తనకున్న సాన్నిహిత్యం, అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. రాంరెడ్డి దామోదర్ రెడ్డి మరణం సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల ప్రజలకు తీరని లోటని కొప్పుల వేణారెడ్డి పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై, నియోజకవర్గాల అభివృద్ధి కోసం పనిచేసిన నాయకుడిగా దామన్నను అభిమానులు గుర్తుచేసుకుంటున్నారని తెలిపారు.

తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తాం

*** జనసేన తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గడల శ్రీనివాసరావు**



ప్రజాస్ఫూర్తి ,ఖమ్మం జిల్లా:జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా, తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామని, తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా జనసేనను నిలబెడతామని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేన అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు స్పష్టం చేశారు. జనసేన పార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం వేడుక ఖమ్మం జిల్లా కేంద్రంలోని గట్టయ్య సెంటర్ ప్రాంతంలో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేన అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం అత్యంత ఘనంగా జరిగింది. కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, సాంప్రదాయ పద్ధతిలో రిబ్బన్ కట్ చేసి కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో డాక్టర్ గడల శ్రీనివాసరావు చేతుల మీదుగా జనసేన జెండా ఆవిష్కరించారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయం పనిచేయనుందని డాక్టర్ గడల శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కోటి అప్పారావ్, దుంపటి శ్రీనివాస్, రాము యాదవ్, మిర్యాల రామకృష్ణ, మిరియాల జగన్ మోహన్, బండారు రామకృష్ణ, యాసంనేని అజయ్ కృష్ణ, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, హసీనా, తాళ్లూరి దేవిడ్, ఆంగోతి శ్రీను, తుడుం ఉత్తం రాజ్ , సచ్చు ప్రవంతి కన్నా, శివరాత్రి రమణ కుమార్, సాయి కుమార్, గంజి ఉదయ్, మామిడి ఉదయ్, నాగరాజు, రాజేంద్రప్రసాద్, బద్రి, బాలరాజు, తుమ్మలపూడి గంగాధర్, కొమ్ము అచ్యుత్, హనుమంతు మౌనిక, దేవేందర్, వెంకన్న, హనుమంతు సాయి కృష్ణ, మద్ది సాయికుమార్, కొమ్ము లక్ష్మి, భరత్, ఆనంద్, రాకేష్, వంశీ, పుల్లారావు, దుర్గాప్రసాద్, నరేష్, హరి, శ్రీకాంత్, నిర్మల, విజయలక్ష్మి ఫయాజ్, బాణాల శ్రీకాంత్, రచ్చ నాగరాజు, జనసైనికులు, వీరమహిళలు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

ఖమ్మంలో జనసేన పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. జనసేన నాయకులు గంగిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 20 మందికి పైగా కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు కవిత మద్దతు

*** ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె ఏడో రోజుకు చేరుకుంది. సమ్మెకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతు తెలిపారు. సోమవారం సమ్మె శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్య శాఖలో సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వారి డిమాండ్లను నెరవేర్చి త్వరితగతిన రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా అధ్యక్షుడు బడితల రమేష్, ఉపాధ్యక్షుడు డాక్టర్ రఘురాం, జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్, డాక్టర్లు జగదీష్, విజయ్, వందన, దీప్తి, మీడియా ఇన్‌చార్జి రాజు, రామ్మూర్తి, ఫార్మసీ ఆఫీసర్ సుమన్, ఏఎన్ఎంలు పార్వతి, కృష్ణవేణి, చిత్ర తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ రథంపై భక్తులకు దర్శనమిస్తున్న మలయప్పస్వామి

స్వర్ణ రథంపై భక్తులకు దర్శనమిస్తున్న మలయప్పస్వామి తిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉభయదేవేరులతో కలిసి స్వామివారు స్వర్ణ రథంపై విహరిస్తూ.. భక్తులకు దర్శనమిచ్చారు. గోవింద నామస్మరణలతో భక్తులు స్వామివారి రథాన్ని ముందుకు లాగారు. ఆ ఫొటోలు





















పెళ్లి తర్వాత తెలంగాణ కోడలిగా తొలి బతుకమ్మ పండుగను సంబురంగా జరుపుకుంది రష్మిక మందన్న. ట్యాంక్‌బండ్ వేదికగా జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకలో భర్త విజయ్ దేవరకొండతో కలిసి రష్మిక మందన్న పాల్గొన్నది. ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడింది. తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగకు రష్మిక ఇచ్చిన విలువకు రాజకీయ వర్గాలతో పాటు సామాన్యులు సైతం ఫిదా అవుతోన్నారు. బతుకమ్మ వేడుకలో పాల్గొని తెలంగాణ సంస్కృతి గొప్పతనాన్ని విజయ్, రష్మిక ఘనంగా చాటిచెప్పారని మంత్రి సీతక్క ప్రశంసలు కురిపించారు. తెలంగాణ ఆడపడుచుగా నిరూపించుకోవడమే కాకుండా ఈ వేడుకకే అందాన్ని తీసుకొచ్చిందని రష్మికను మెచ్చుకుంటున్నారు. బతుకమ్మ పండుగకు రష్మికను తీసుకొచ్చి, మన సంప్రదాయంలో భాగస్వామిని చేయడం అభినందనీయం అంటూ విజయ్‌ని ప్రశంసిస్తున్నారు.

రష్మిక.. పూజా.. రుక్మిణి.. ఇప్పుడు దేవిక



తెలుగు ఇండస్ట్రీలో కన్నడ బ్యూటీల హవా కొనసాగుతోంది. రష్మిక మందన్న, పూజా హెగ్డే, రుక్మిణి వసంత్‌తో పాటు పలువురు కన్నడ సుందరీమణులు టాలీవుడ్ టాప్ హీరోయిన్లుగా చెలామణి అవుతోన్నారు. తాజాగా వీరి బాటలోనే మరో శాండల్‌వుడ్ సుందరి దేవికా భట్ అడుగులు వేయబోతుంది.
ఎంబీఏ పూర్తిచేసిన దేవికా భట్ ఓ ఆర్కిటెక్చర్ కంపెనీలో చాలా రోజుల పాటు జాబ్ చేసింది. యాక్టింగ్‌పై ఇంట్రెస్ట్‌తో ఉద్యోగాన్ని వదిలేసిన ఈ కన్నడ భామ రామాచారి సీరియల్‌తో ఫస్ట్ టైమ్ కెమెరా ముందుకొచ్చింది. ఈసీరియల్‌లో రుక్మిణి అనే పాత్రలో అసమాన నటనతో ఆకట్టుకుంది. సీరియల్ ద్వారా వచ్చిన గుర్తింపుతో కన్నడ సినిమా బృందా విహారిలో ఛాన్స్ దక్కించుకుంది. గణేష్ హీరోగా నటించిన ఈ మూవీకి దండుపాళ్యం ఫేమ్ శ్రీనివాసరాజు దర్శకత్వం వహించాడు.
కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తోన్న మూవీ... రియాలిటీలో దేవికా భట్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆలోచన అనే పాత్రలో కనిపించబోతుంది.



గాయని సుశీల బయోపిక్

తెలుగు దిగ్గజ నేపథ్య గాయని సుశీల జీవితం సినిమాగా వెండితెరపైకి రాబోతుంది. తెలుగు, తమిళంతో పాటు పదకొండు భాషల్లో కలిపి యాభై వేలకుపైగా పాటలు పాడారు పి సుశీల. ఒక్క తెలుగులోనే 12వేల సాంగ్స్‌ను పాడి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్నారు. తెలుగు కుటుంబంలో పుట్టి తమిళం, మలయాళం, కన్నడంతో పాటు అనేక భాషల్లో టాప్ సింగర్‌గా పేరుతెచ్చుకున్నారు. ఐదు సార్లు నేషనల్ అవార్డులతో పాటు పద్మభూషణ్‌తో పాటు అనేక పురస్కారాలు దక్కించుకున్నారు. ఈ సినిమాలో టైటిల్ పాత్రలో కన్నడ నటి రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటించబోతుంది.

విలన్‌గా రితేశ్



టాలీవుడ్ హీరో రామ్ పోతినేని డైరెక్టర్‌గా మారి ఓ సైకలాజికల్ థ్రిల్లర్ సినిమాను తెరకెక్కిస్తోన్నారు. ఇందులో ఆయనే హీరోగా కనిపించబోతున్నారు. అయితే ఈ సినిమాలో జెనీలియా భర్త విలన్‌గా రితేష్ దేశ్‌ముఖ్ కనిపించబోతున్నాడు. సోమవారం ఈ బాలీవుడ్ హీరో రామ్ మూవీ సెట్స్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా మేకర్స్ ఓ స్పెషల్ వీడియోను రిలీజ్ చేశారు. నేటి నుంచి కొత్త షెడ్యూల్ మొదలైనట్లు ప్రకటించారు. పాతకాలం నాటి బిల్డింగ్‌లో షూటింగ్ జరుగుతోన్నట్లు ఈ వీడియోలో చూపించారు.

రితేష్, జెనీలియా ఫ్యామిలీతో రామ్‌కు చక్కటి స్నేహం ఉంది. రామ్, జెనీలియా కలిసి రెడీ సినిమాలో నటించారు. ఆ స్నేహబంధంతోనే రామ్ డైరెక్షనల్ డెబ్యూ మూవీలో నటించడానికి రితేష్ ఒప్పుకున్నట్లు సమాచారం. ఈ సినిమాను రామ్ సోదరుడు కృష్ణచైతన్య నిర్మిస్తున్నారు. దాదాపు వంద కోట్ల బడ్జెట్‌తో ఈ మూవీ రూపొందుతోన్నట్లు సమాచారం.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.